కథనం :

# 'ఒరిగిన అన్నల కెన్నీయలో....'

పి. చంద్

గోధుమవన్నె నీటిరంగుతో ప్రాణహిత పచ్చటి చెట్లమధ్య పరవళ్ళుతొక్కుతూ సాగిపోతున్నది. ప్రాణహితకు పడమరదిక్కున పెద్దిశంకరన్న నాటిన ఎర్రపూలవన మున్నది. తూర్పున కూలిజనం రెక్కలు ముక్కలుచేసుకొని సవరచ్చన చేసిన 'భూదేవి' దొరవారి చెరల ఉన్నది.

అటువంటి నేలలో మోకాలుమంటి బురదలో కూలీజనం నడుములు వంచి, తలలువాల్చి అంటుకపోతున్న ఖాలీకడుపులతో కలుపులుతీస్తూ అలిసిపోయివున్నవేళ....

చల్లటిగాలివోలె ఎర్రపూలవనం నుండి 'ఎన్నెల'పాట పాడుతూ సూరీడు వచ్చిండు....

నడుమువంచిన రామక్క తలెత్తి పాటవచ్చిన దిక్కుగా చూసింది.... పాట లోని మాటను ఆలకించింది. పాటలోని బతుకు తనబతుక్కి పోల్చుకుని ఆవేశం పొంగిరాంగ, "ఏంబతుకులు పాడుబతుకులు పొద్దుపొడిసినకాన్నుంచి పొద్దుగూకె వరకు పనిచేసినా కడుపునిండదాయే.... చేసేంభాగ్యం చేయకేంభాగ్యం" అని బయిటికేఅంది.

"అవును నిజం.... ఏంబతుకులు మనయి" వీరస్వామి వంతపాడిండు.

అలిసిపోయిన కూలీలు ఒకచోట కూచొని ఆలోచన్లపడ్డరు....

సూరీడు దగ్గరగావచ్చి "మన అన్ని కష్టాలకు మూలం మనకు భూమిలేక పోవడమే" అన్నడు.

"నిశ్చంగా అంతే" ముసలి బక్కయ్య సమర్థించిండు. బొక్కినోరు ఎల్లబెట్టి.

"దున్నుకోవడానికి భూమికావాలె"

"భూమి మన దగ్గరుంటే మనకష్టాలు దూరమైతయి"

"ఆకలికిమాడి సచ్చేదుండదు" అందరి ఆలోచన్ల అదే....

"అయితే భూమిఎక్కడుంది?" సూరీడు ప్రశ్నించాడు.

752

"దొరదగ్గర" చిప్పిరెంటికల చినలచ్చి టక్కునబదులిచ్చింది. నిజమేఅన్నట్లు అక్కడున్నోల్లంతా తలలూపిండ్లు.

సూరీడు మళ్ళవోరిప్పిండు "అవును దొరదగ్గరుంది భూమి. దొరదగ్గరకు ఎందుకుచేరింది ?" ప్రశ్నిస్తున్నట్టుగా అందరినిచూసి మళ్ళీతనే చెప్పటం మొదలుపెట్టిండు. "దొరపుట్టినపుడు బొడ్లేసుకపుట్టిండా ? లేకుంటె చెట్టుపుట్టాకొట్టి నేలను సాపుచేసిండా ? నాగలిపట్టిండా ? విత్తునాటాడా ? కాపుకాసాడా ? ఇదేదీచేయని దొరకు పంటెందుకు చెందాలి ?"

అందరు ఆలోచనల్లపడ్డరు. ఉండి ఉండి "దొరకుబలంఉంది జులుంచేస్తడు" భయపడుతూ పలికిండొకడు.

"దొరకు రెండుచేతులు. మనకు వందల వేల చేతులు" సూరీడి ధైర్యానికి అందరు.... తమపిడికిళ్ళను చూసుకున్నారు. మట్టిపిసికి, చెట్టుకొట్టిన చేతుల్ల నరాలు జివ్వునపొంగి నిజమేఅన్నాయి.

"ఆకలికి ఎట్లాగూచస్తాం. ఆ సచ్చేదేదో పోరాడిచస్తాం"
"పుట్టేదోరోజు సచ్చేదోరోజు"
"బతికిసచ్చేకంటే పోరాడి సచ్చిబతుకుతాం"

"అయితే దొరభూమినిదున్నాలి- దున్నేవానిదేభూమి" అందరూ ఒక్కటై అన్నరు.

* * * *

దొరభూమిల ఎర్రిజెండాలు మొలిసినయి.... నాగళ్ళు పాటలుపాడినయి.
దొరగుండెల గుండుపడ్డది.

దొర ఖద్దరుబట్టలను కలిసిండు "మాదేముంది. అంతా అయిపోయింది.... కాని ఫలానాచోటికి పొమ్మన్నడు ఖద్దరుబట్టలాయన కాషాయవస్త్రాలను చూయించి.

దొర కాళ్ళు వణుకంగ.. కాషాయవస్త్రాలుండే కుటీరంలకు పోయిండు.... మేకతోలుకప్పుకున్న స్వాములవారు దర్శనమయ్యేసరికి బారెడుపొద్దు ఎక్కింది.. అయినా దొరకు ఆకలిగాని దప్పికగాని వేయలేదు. స్వాములవారి శాంత గంభీర రూపంచూసి ముగ్ధుడైపోయిండు దొర. దొర స్వాములవారి పాదపద్మాలకు సాగిలపడి "ప్రభూ మీరే మమ్మల్ని రక్షించాలి" అతి వినయంగా దీనంగా ప్రార్థించిండు.

స్వాములవారు తేరుకొని ఎడమచెవి కుండలం మెరియంగా సెక్రెటరీవేపోసారి చూపిండు. ఏంచేయాలన్నట్టు..

"ప్రభువీరు మన ప్రభుత్వానికి పునాదిరాయి వంటివారు మన పునాది రాయిని మనమే నాశనం చేసుకుంటామా ?" సెక్రెటరిగారు విన్నవించుకున్నరు.

"ఆఁహా.... అయితే మన సుస్థిరత్వానికి, మన ఆత్మగౌరవానికి, మన జాతి గౌరవానికి భంగకరమైనఏచర్యనూ మనం సమర్థించను. అరాచక శక్తులఆట కట్టించటానికి కావలసిన సహాయము తక్షణమే చేయండి. కన్పిస్తేకాల్చేయండి." పట్టుబట్టల స్వాములవారు ఉగ్రరూపందాల్చి ఆర్డరేసిండు.

స్వాములవారి అనుజ్ఞమేరకు

దొరగారి ఊళ్ళో కాకిబట్టలేసుకున్న పీతిరిగద్దలు తుపాకులు వేలాడేసుకొని వాలాయి. కనిపించిన వాళ్ళందరిని వడితిరిగిన గోళ్ళతో ముక్కుతోరక్కి రక్తాలు కారేలాచేసాయి.

* * * *

దొర సర్కిల్‌తో రక్తంలాంటి బరండీ తాగుతున్నడు. వేయించిన లేతకోడి మాంసము.... మేక కార్జముల పూరీలద్దుకొని దొర సర్కిల్‌గారి తుపాకిని చూస్తూ "తమరాసూరిగాన్ని లేకుంటా చెయ్యాలి.... వాడున్నంతసేపు నాకు నిద్దురుండదు" మనసులో మాటన్నడు.

"వాడ్నికూడా ఇలాసూపు వండుకొనితింటా" అని ఈది అమీన్‌లా వికృతంగా నవ్విండు సర్కిల్.

దొర సర్కిల్ మొఖంల చూసిండు.... మత్తుచేత ఎర్రబడ్డకండ్లు మూసుకపోతుంచే కావ్వెక్కిన ఎర్రటిముఖం భయంకరానందంగా అగుపించింది దొరకు..

ఆ నవ్వుకోలేక తాగినమైకంవల్లనోగాని దొరమనసు కుదుటపడింది.

* * * *

వూళ్ళోకి షికారుకువెళ్ళిన కాకిబట్టల పీతిరిగద్దలనుచూసి.... జానకమ్మ తలు పేసింది. అదిచూసిండు హెడ్డు. హెడ్డుగారి హెడ్డులో ప్రమోషన్ గురించేకాదు రాష్ట్రపతి పతకంకూడా మెదిలింది.

తలుపేసుకున్న జానకమ్మకు అడివిలనుండి పొయ్యిలకని కొట్టుకొచ్చిన కట్టెలమోపు కనిపించింది. 'అయ్యో ఫారెస్టువాళ్ళు రానేవచ్చారే ఈ కట్టెలమోపు ఎక్కడనిదాచేది' అని మథనపడింది.

తలుపుచప్పుడైంది

జానకమ్మ భయంతో బిగుసుకపోయింది.

తలుపు బిలబిలమంటు కూలింది. ఆచప్పుడు భయంతో ఎదురేగిన జానకమ్మ చెయ్యిని తొడను తొలుచుకుంటుపోయి పీతిరిగద్ద తుపాకిగుళ్ళు గోడలదిగినయి విల విల లాడుతూ జానకమ్మ నేలమీద పడిపోయింది. ఈ హడావిడికి ఇంట్లోనుండి బయటికొచ్చిన జానకమ్మమొగుణ్ణి తుపాకీమడమ ఈడ్చిగుద్దింది. మరుక్షణంలో మూతిపళ్లిరిగి బళ్ళున రక్తంకక్కిండు. పక్కింట్లోనుంచి ఉరికొచ్చిన జానకమ్మ తమ్ముడు 'ఇదెక్కడి అన్యాయం ఉత్తపుణ్యానికి సంపుతాండ్లు' అని అడిగిండు.

"నక్సలైట్ లంజకొడుకా నడువుబే" అంటూ లాటీబితిప్పుతూ పీతిరిగద్దలు క్యాంపుకు లాక్కపోయినయి ముగ్గుర్ని.

సూరీడిగురించి ఆరా తీయటంకోసం బాగాబలిసిన పిడికిలి ఉపయోగించి యాష్టవొచ్చేదాకా గుద్దిండు. ఆతర్వాత కాళ్ళతో ఫుట్ బాల్ ఆడి అదికూడ యాష్టకొచ్చి లాటీతో సాముచేసి.. చివరికి 'మాకేంతెల్వదు' అన్న సమాధానం తప్ప మరోటి పొందలేక అలసిపోయి నిద్దురపోయిండు.. శాంతి పరిరక్షకుడు సర్కిల్.

మరోరోజు

ఊరిచివరి మక్కపెరడును కంటికిరెప్పవోలె, కన్నబిడ్డతీర్గ కాపుకాస్తున్న మల్లయ్య పంటలను పాడుచేస్తున్న పిట్టలను కొట్టడానికి పొటాసుమందును ఉండచుట్టి రాయిమీదేసి బాదిండు.... అది అక్కడి ఆనవాయితీ.

'ఢాం' అని పెద్దగా చప్పుడయ్యింది.

పిట్టలులేసిపోయినయి.. గాలికి మక్కచేను కిలకిల నవ్వింది.

నిద్దురమొఖం పీతిరిగద్దలు దిగ్గునలేచినయి 'అదిగో అటువైపే' యస్. ఐ

'అవును ఆవైపునుండే వచ్చింది తూటా' హెడ్డువంతపాడిండు....

సర్కిల్ 'ఫైర్' అని అరిచిండు ముచ్చెమటలు పోయంగా.

ఇంకేముంది !

తుపాకులు టపటపలాడినయి. తూటాలు ఆకాశంలోకి, మక్కచేనులోకి, దిక్కున్నచోటికల్లా పారిపోయినయి.. బొక్కబోర్లపన్న పెద్దగద్దలేచి మెడసారించి ఆలోచన్లపడ్డది. అటువైపెవరూలేరని నిర్ధారించుకొని ట్రిగ్గర్ మీద చేతులుంచుకొని తిరుపతెంకన్నకు మొక్కుకొని ముందుకు కదిలింది,

మంచెమీది మల్లయ్య కిమ్మన్నాస్తి అయిపోయిండు. కళ్ళుతెరిచేసరికి చుట్టూరా పొగలుకక్కుతున్న తుపాకి గొట్టాలు.

755

"ఏడిరా సూరీడు" సర్కిల్ కర్కశంగా

అర్థంకాక ఆకాశంవైపు చూయించిండు మల్లయ్య. మిట్టమధ్యాహ్నం సూరీడు నిప్పులు చెరుగుతాండు

"నకరాలు చేస్తున్నావురా లంజకొడుకా.... మారో మాకెలవుడెకో"

తుపాకి మడమలు, లాటీలు భరతనాట్యం చేసినయి.

మల్లయ్య కళ్లుతెరిచి చూసేసరికి కాగంతకడుపున్న సర్కిల్ చెక్కకుర్చీల యమధర్మరాజోలే కూచున్నడు.

"మంచిగా ఉన్నదిఉన్నట్టు చెప్పుబిడ్డా నిన్నిడ్సిపెడ్తం" నవ్వుమొఖం పెట్టిండు సర్కిల్.

"పిట్టలనుకొట్టడానికి తుపాకిమందు పేల్చింది నిజమే బాంచెను" గొంతు తడారిపోతుంటే మల్లయ్య.

'మళ్ళఅదేమాట లంజకొడుకు మదమనగలేదు. మదమనుచుండ్లి అరిచిండు సర్కిల్.

చింతచెట్టు కొమ్మకు తలకిందుగా వేలాడేసినయి పీతిరిగద్దలు. మల్లయ్య అరిచి అరిచి చివరికి పిల్లిగొంతుపడి మాటాగిపోయేవరకు పీతిరిగద్దలు పీక్కతిన్నాయి.

మొఖంమీద చల్లటినీళ్లుపడగానే కళ్ళుతెరిచిండు. తెలివచ్చినమల్లయ్యను రెండు కుర్చీలమధ్యరాడు 'కోళ్ళగుజి' వేసి వేలాడేసిండ్లు. పాదాలు చిట్లిపోయినయి నెత్తుర్లు కార్తినయి ముంజేతినికోసిన ఇనుపరాడు నరాలను పీకుతంది. మరోసారి ఈ లోకం మరిచిండు మల్లయ్య.

"లంజకొడుకు సావనైన సచ్చేట్టుందికాని ఒక్కమాటన్న మాట్లాడుతలేడు" యస్. ఐ.

అయ్యా శ్వాసబరువుగా ఆడుతంది' ముక్కుమీదవేలేసి చూసిన హెడ్డు అన్నడు.

"సత్తడా కొంపదీసి. సావనీ మనల్ని అడిగేదెవరు' సర్కిల్ తనలోనే గుసుక్కుని బయిటికిమాత్రం 'పీడ్నితీస్కపోయి వాడిఇంటిముందు వదిలేసిరాండ్లి' ఆర్డరేసిండు.

756

మల్లయ్య తనింటిముందు చావుబతుకులమధ్య పడివున్నాడు తెల్లారేసరికి.

మరునాడు-

సర్కిల్‌ను కల్వబోయినదొర అక్కడున్న దినపత్రిక తిరిగేసి ఆశ్చర్యపోతూ "అదేమిటండి మనవూళ్ళో ఎదురుకాల్పులా! ఎప్పుడుజరిగినయి?" అంటూ బయటికి చదివిండు "చెల్కలో ఎదురుకాల్పులు, పోలీసులకు నక్సలైట్లకు జరిగిన ఎదురు కాల్పుల్లో ఎవరికీ గాయాలుతగలలేదు, నక్సలైట్లు అడవులకు పారిపోయారు".

దొరవారి తెలివితక్కువతనానికి పోలీసుబుర్రివవ్వి "ఇందులోలాజిక్ మీకు అర్థంకాలేదనుకుంటా రేపెవడినన్న పట్టుకొని మనం కాల్చిచంపినా జనం పెద్దగా పట్టించుకోకుండా ఉండేందుకు."

"మొత్తానికి ఏమోఅనుకున్న మంచితెలివైనవారే" దొర మార్మికంగా నవ్వింది

* * * *

ఆరోజు అగస్టు 30

చాలదూరంనుండి నడిచివచ్చిన సూరీడు జానకమ్మగాయాలను తడిమి ఓదార్చింది. కమిలిపోయిన మల్లయ్య ఒళ్ళునునిమిరి.... మందురాసింది. 'ఏమైనామనం పోరాడాలే' మల్లయ్య కలవరిస్తాండు. చుట్టు గుమిగూడిన జనాన్ని ఉద్దేశించి సూరీడు "మనం పోరాడాలి.... ఈ కన్నీళ్ళు, కష్టాలు చిత్రహింసలుచూసి బెదిరిపోకూడదు. మనకీకష్టాలు కన్నీళ్ళు కొత్తకాదు. చిన్నచిన్న రోగాలకే మందులేక మనపిల్లలు కొంకిర్లుపోయి మనకళ్ళముందే విలవిల్లాడి చచ్చిపోతుంటే చూసాము. ఉడిగిపోయిన చేతులతో కడుపుకు తిండిలేక ఆకలికి వోర్చుకోలేక పీక్కుపోయిన కడుపులతో ఆకలి ఆకలిఅంటూ మనతల్లిదండ్రులు మనకళ్ళముందే కళ్ళుమూస్తుంటే చూసాము. రెక్కలు ముక్కలుచేసుకొని సాది సవరచ్చినచేసి పండించినపంటను దొరలు తోలుకపోతుంటే కాలేకడుపులతో గుడ్లనీళ్ళుకుక్కుకుంటూ నిలబడ్డాము. ఇంతవరకు సుక్కచెమటంటే ఎరగని దొరలు మనచెమటను రక్తాన్ని కలుపుకొని విందు విలాసాల్లో మునిగి మనచెల్లెల అక్కల మానప్రాణాలతో ఆడుకుంటుంటే ఇదెక్కడి అన్యాయమని ఎదురుతిర్గి నిలబడ్డాం. అడుగడుగున చస్తూ బ్రతకలేమని మనమీద జరుగుతున్న దోపిడీకి అన్యాయానికీ వ్యతిరేకంగా పోరాటంచేపట్టాం.... చావుమనకు సహజం. ఆకలితో రోగాలతో చచ్చేకంటే పోరాడిచస్తాం. ఇంతవరకు ఈ దొరలు మనమీద ఏ అన్యాయంచేసినా మారుపలకని ప్రభుత్వం దొరజులుంకు వ్యతిరేకంగా మనం పోరాడేసరికి తన పోలీసుబలగాలను పంపింది. ఎందుకు? ఈదొరలనుకాపాడేదే ఈ ప్రభుత్వం దానిబలగం. ఈ తుపాకీపెత్తనాన్ని మనం అంతాఒక్కటయి

తుపాకీతోనే ఎదుర్కోవాలి. అందుకు మనకుప్రజాసైన్యం కావాలి.... మనమంతా సాయుధులమై ప్రజాసైన్యంలో కలవాలి" సూరీడు ఆవేశంగా చెపుతుంటే....

అందరి రక్తము పొంగుతూంది.

అంతలకే బయట అలజడి

మానవరక్తాన్ని రుచిమరిగిన బొల్లిగద్ద కాషాయవస్త్రాల ముసుగేసుకొని, పిరికి గద్దలను వెంటేసుకొనివచ్చి ప్రజలమీద తుపాకులు పేల్చింది....

సూరీడు రక్తము చిందించాడు. ప్రాణహిత కన్నీరుమున్నీరుగా ఏడ్చింది.. నేలకూలిన సూరీడి ప్రతినెత్తురుబొట్టులో తననీడను చూసుకుంటున్న సూరీడు, ఆకాశంలో వేలవేల రూపాలుగా వడివడిగా అడుగులేస్తూ భూమి నాలుగు చెరుగులా వ్యాపిస్తున్న సూరీడు, సుధాకరుడై ఆకాశంలోకెగబాకాడు.

(ఆదిలాబాద్ జిల్లా చెన్నూరు తాలూకా పిన్నారం గ్రామంలో పోలీసు కాల్పుల్లో అమరుడైన కా॥ పల్లె కనకయ్య (సుధాకర్) స్మృతిలో)

---

(3వ కవరు తరువాయి)

అంకమ్మ[3] సాచెల్లె
అసలుమాట చెప్పింది
ఒక్కసిపోలీసోడు
తరిమి నిన్ను కాల్చిండని
అంకన్న[4] చెప్పిండు
ఆవేదననణచుకొని
పోరుబాట ఇడుపనని
ఎర్రజెండ దించనని ॥పల్లె పల్లె॥

కండ్లనీళ్లు పెట్టనోళ్లు
లేరంటే నమ్మ నమ్మ
చెన్నూరు అడవుల్లో
ఎర్రపూవై పూసినావు

ప్రాణహిత నీమీద
పాటలెన్నో పాడుతోంది ॥పల్లె పల్లె॥

నువ్వు నడిచినబాట
జనంబాట జయంబాట
నువ్వు చెప్పినమాట
పల్లె పల్లె ప్రతినోట
ఎర్రజెండ ఎత్తిపట్టి
మునుముందుకె సాగుతాము
పల్లె పల్లె తిరిగినావు
పల్లె కనుకన్నో పల్లె కనుకన్నా
పల్లెలెన్నొ లేపినావు
పల్లె కనుకన్నో పల్లె కనుకన్నా

758

3,4 పిన్నారం సంఘటనకు సాక్షులు